క్లుప్తంగా

నేడు తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: తెనాలి డి–2 సెక్షన్ పరిధిలోని 33 కేవీ అంగలకుదురు, 11 కేవీ సుల్తానాబాద్ ఫీడర్ లైన్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, సుల్తానాబాద్, సుందరయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఒకటో వార్డులో గురువారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. కాల్వల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆమె సిబ్బంది పై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కాల్వలు బాగు చేయాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీఓ సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఏఈ రాజు, తదితరులు ఉన్నారు.

23న చిన్న పిల్లల గుండె వైద్య శిబిరం




తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి జిల్లా వైద్యశాలలోని డైక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 23 తేదీన చిన్న పిల్లల ఉచిత గుండె శిబిరం నిర్వహించనున్నట్లు డైక్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మధుబాబు గురువారం తెలిపారు. రమేష్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. గుండెకు సంబంధించిన టుడీకో, ఈసీజీ తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. జిల్లా వైద్యశాల ఆవరణలోని డైక్ సెంటర్‌లో ఉదయం 9 గంటల నుంచి వైద్యశిబిరం ప్రారంభమవుతుందన్నారు. గుండెజబ్బుతో బాధపడే చిన్నారులకు శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 18 సంవత్సరాల లోపల వయసున్న చిన్నారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి సూచించారు.

అథ్లెట్ వెంకటరామిరెడ్డికి ఆర్థికసాయం



తెనాలి: కర్నూలు జిల్లా మంత్రాలయంకు చెందిన అథ్లెట్, కేఎల్ యూనివర్శిటీ విద్యార్థి మొగలి వెంకటరామిరెడ్డికి అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమయేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ అందజేశారు. మంగళగిరిలోని తన కార్యాలయంలో గురువారం ఈ సహాయం చేశారు. వెంకటరామిరెడ్డి భారతదేశం తరఫున అమెరికాలో 2026లో జరగనున్న అండర్–20 వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్, అదే ఏడాది దక్షిణ కొరియాలో జరగనున్న అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఎంపికైనట్టు తెలిపారు. ఇలాంటి ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు.

చోరీ ఘటనలో నిందితుడు అరెస్టు



కొల్లిపర: ఈనెల 12వ తేదీన మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో జొన్నల జాన్‌రెడ్డి ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన షేక్ శేషావలి వ్యసనాలకు బానిసై గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతుంటాడన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి జొన్నల జాన్‌రెడ్డి ఇంటి తాళాలు పగలకొట్టి గదిలో ఉన్న ల్యాప్‌టాప్, రూ.70వేలు విలువ చేసే వెండి వస్తువులు దొంగిలించాడు. శేషావలి కదలికలపై అనుమానంతో గట్టిగా ప్రశ్నించగా.. చోరీ చేశానని ఒప్పుకున్నాడన్నారు. వెండి వస్తువులు, ల్యాప్‌టాప్ స్వాధీన పరుచుకుని, చోరీకి ఉపయోగించిన వస్తువులను కూడా సీజ్ చేసి నిందితుడు శేషావలిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

నేడు సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో నేడు గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు, అమరావతి ప్రాంత వాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

- అందుకే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ
- మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- వల్లభాపురంలో సంతకాల సేకరణ



వల్లభాపురంలో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): రాష్ట్రంలో పేదలకు వైద్య, విద్య దూరం చేయడానికి చంద్రబాబు కుట్ర పన్నారని, అందుకే వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ధ్వజమెత్తారు. మండల పరిధిలోనే వల్లభాపురం గ్రామంలో గురువారం రాత్రి గ్రామ కమిటీల ఏర్పాటు అనంతరం కూటమి ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాల ప్రైవేటీకరణ నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నియోజకవర్గంలో తొలిసారిగా వల్లభాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేసి, బడాబాబులకు అప్పగించాలని చూస్తోందన్నారు. దీనికి చెక్ పెట్టేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రతి గ్రామంలో, పట్టణాల్లో తల పెట్టారన్నారు. ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం వలన పేదలకు, పేద విద్యార్థులకు, పేద రోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో పేద ప్రజలకు వైద్యం భారంగా మారిందని, ఎన్టీఆర్ వైద్యసేవగా పేరుమార్చిన ఆరోగ్యశ్రీని నేటి కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. వివిధ ఆస్పత్రులకు సుమారు రూ.3వేల కోట్లు బకాయిలు ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా నేడు ఆరోగ్యసేవలు నిలిచిపోవటం జరిగిందన్నారు. పేదలు ఆస్తులు అమ్ముకుని వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, బాబూజీ రెడ్డి, అవుతు పోతిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఆవుతు శేఖరరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, ఉత్తే జీరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆళ్ళ శివనాగిరెడ్డి, పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

వల్లభాపురం(కొల్లిపర): ఇకపై పార్టీ కార్యకర్తలకు తప్పకుండా మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్టీ గ్రామ, వార్డు కమిటీల నియామకంలో భాగంగా మండల పరిధిలోనే వల్లభాపురం గ్రామంలో గురువారం రాత్రి ముఖ్యనేతల సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివకుమార్ మాట్లాడుతూ గతంలోలా కాకుండా పార్టీ తప్పక ప్రతి కార్యకర్తను గుర్తించే పనిలో ఉందన్నారు. ప్రతి గ్రామంలో కమిటీల ఏర్పాటు పూర్తయిన తర్వాత ఐడీ కార్డులు ఇస్తారని, ప్రతి కార్యకర్త వివరాలు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాష్ బోర్డులో ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ గత ఐదేళ్లపాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి అందించటం జరిగిందన్నారు. తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో రూ.2.85లక్షల కోట్లు సంక్షేమానికి అందించామన్నారు. నియోజకవర్గంలో రూ.1800 కోట్లు సంక్షేమంద్వారా నేరుగా ప్రజల ఖాతాలో జమచేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు. మండల, గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలను పటిష్టంగా నియమించి వారి ద్వారా గ్రామాల్లో సంక్షేమం అందించి పార్టీ బలోపేతం చేయటం జరుగుతుందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఇప్పుడు ఏర్పాటు చేసిన ఆయా కమిటీలకే పరిపాలనలో నిర్ణయాధికారం ఉంటుందన్నారు. ఆయా గ్రామ పార్టీ సీనియర్ నాయకులు వారి గ్రామాలల్లో సమర్థులతో కూడిన కమిటీలను నియమించుకోవాలని సూచించారు. కమిటీలు పూర్తి అయిన తరువాత కమిటీ సభ్యులు మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. కమిటీ పరిశీలకులుగా ఆళ్ల శివనాగిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, బాబూజీ రెడ్డి, అవుతు పోతిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఆవుతు శేఖరరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, ఉత్తే జీరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇసుక కొరత ఏర్పడిందని చెప్పారు. దీనివలన అభివృద్ధి పనులు నిలిచిపోవడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఇసుక లభ్యత ఉన్న నేపథ్యంలో పట్టణంలో నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాలని సూచించారు. అలాగే ఎక్కడా అనధికార కట్టడాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. చినరావూరు ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను కొనసాగిస్తూ ఆదర్శవంతంగా డివిజన్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు, ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబు, ఎంఈ శ్రీకాంత్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, డీఈలు, ఏఈలు, టీపీఓ పాల్గొన్నారు.

19న వెరికోస్ వీన్స్ ఉచిత వైద్యశిబిరం



కరపత్రాన్ని ఆవిష్కరించిన ఈదర వెంకట పూర్ణచంద్

తెనాలి: రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో గల పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఉచిత వెరికోస్ వీన్స్ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ సహకారంతో జరిపే ఈ వైద్యశిబిరం వివరాలను రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ ఆదివారం జరిగే వైద్యశిబిరంలో వెరికోస్ వీన్స్ సమస్య కలిగిన ప్రతిఒక్కరూ వచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, రోటరీ డిస్ట్రిక్ట్–3150 అమరావతి రీజియన్ క్యాన్సల్ ఎవర్నెస్ ఛైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, పావులూరి రాంబాబు, ఈదర శ్రీనివాసరావు, జగదీశ్వరాంబ, మల్లాది అర్జున్, కళాకారుల సంఘం తరపున చెరుకుపల్లి సింగారావు, దేవరపల్లి భవాని, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ మధు పాల్గొన్నారు.

సమాధుల తోటకు స్థలం కేటాయించండి

తెనాలిఅర్బన్: క్రైస్తవుల సమాధుల తోట నిండిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, దీని కోసం స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఐతానగర్ ప్రాంతవాసులు కోరారు. బోసురోడ్డులోని మంత్రిని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సమాధుల తోట స్థల సాధన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దీపం–2 పథకం కింద మూడోవ విడత ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీని తెనాలి ప్రగాఢ కోటయ్యనగర్‌లో గురువారం సాయంత్రం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సిలెండర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష విడనాడాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి వేముల ప్రియాంక

తెనాలిఅర్బన్: సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, ఆడపిల్లలపై వివక్ష వీడాలని నందులపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. ఆరోగ్య సిబ్బందితో గురువారం అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్త పూర్వ, గర్భస్త పిండ ప్రక్రియ నిషేధ చట్టం అనుసరించి అందరూ నడుచుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు ఎవరు చేయకూడదని సూచించారు. ఆడపిల్లల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గర్భస్త పిండ హత్యకు పాల్పడితే చట్టపరంగా శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెచ్‌వీ చింతల ప్రసన్న పుష్పలత, సిబ్బంది బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండండి..



కోగంటి హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ విజయగౌరి

తెనాలిఅర్బన్: బాల్య వివాహాలకు బాలికలు దూరంగా ఉండాలని తెనాలి సీడీపీఓ విజయగౌరి సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకల్లో భాగంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలపై తమకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించారు. సమావేశంలో సూపర్‌వైజర్ నాగమణి, స్కూల్ హెచ్‌ఎం కె.రాజారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలకలూరు జెడ్పీ స్కూల్‌లో...

తెనాలిటౌన్: బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు అధికారిణి పి.విజయగౌరి పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోషణ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు లేక పాట్లు.. సీటు కోసం ఫీట్లు



వచ్చే అరకొరా బస్సుల్లో సీట్ల కోసం ఫీట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రధాని మోదీ పాల్గొన్న సభకు తెనాలి నుంచి 37 బస్సులను ఆర్టీసీ అధికారులు పాణ్యం నియోజకవర్గానికి పంపారు. దీంతో బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తెనాలి డిపో పరిధిలో మొత్తం 24 హైర్ బస్సులు, 62 సూపర్ లగ్జరీ, పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఇవి ప్రతి రోజు 32 రూట్‌లలో వెళ్తూ ప్రయాణికులకు సేవలు అందిస్తుంటాయి. వీటిలో 37 బస్సులను పాణ్యం నియోజవర్గానికి పంపాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించడంతో బుధవారం సాయంత్రం డిపో అధికారులు వాటిని అక్కడికి పంపారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తెనాలి బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చే ఒకటీ, అరా బస్సులు కిక్కిరిసిపోవడంతో సీటు కోసం ఫీట్లు చేయక తప్పింది కాదు.

– తెనాలి అర్బన్



బస్సులు లేక నిర్మానుష్యంగా ఆర్టీసీ డిపో



బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

తెనాలిలో విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజనీర్ చిరంజీవి

తెనాలిటౌన్: మీటర్ ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ విభాగం పర్యవేక్ష ఇంజినీర్ వీవీ చిరంజీవి హెచ్చరించారు. రూరల్ మండలంలోని అంగలకుదురు, గుడివాడ, కొలకలూరు, కోపల్లె, సంగం జాగర్లమూడి, కంచర్లపాలెం, కఠెవరం, నందివెలుగు గ్రామాల్లో విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 3,358 సర్వీసులు తనిఖీలు చేసి పలు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ వీవీ చిరంజీవి మాట్లాడుతూ మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 34 మందిని గుర్తించి రూ.1.46 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. మొత్తం రూ.2.26లక్షల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో 45 మంది అధికారులు, 135 మంది సిబ్బంది పాల్గొని 3,358 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ చట్టానికి లోబడి మీటర్లకు తప్పని సరిగా సీల్ ఉండేటట్లు నిర్ధారించుకోవాలని చెప్పారు. సీల్ లేకపోయిన, తుప్పుపట్టి ఊడిపోయిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. పని చేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్న ఉండవల్సిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీల్ లేకపోయిన విద్యుత్ చౌర్యంగా నిర్ధారణ చేయబడుతుందని వివరించారు. మొదటి తప్పిదానికి అపరాధ రుసుము, రెండో తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు. రుసుము కట్టలేని పరిస్థితిల్లో ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అక్కల సత్యనారాయణ, విజిలెన్స్ డీఈ ఎస్‌ఏ కరీమ్, రూరల్ డీఈ కె.రాజశేఖర్, డీఈలు ఎస్.మల్లిఖార్జునప్రసాద్, కె.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, బి.అశోక్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సీఐ

తెనాలిరూరల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన తెనాలి త్రీ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గురువారం ఇక్కడి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. త్రీ టౌన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సీఐ సాంబశివరావుకు మనోహర్ సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో నివాసముండే ఓ కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లగా ఆ ఇంట్లో చోరీ జరిగినట్లు బంధువులు గుర్తించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం మహానాడు ప్రాంతంలో నివాసించే పల్లంట్ల రామచంద్రరావు విశాఖపట్నంలోని తన బంధువుల ఇంటిలో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. తాళాలు వేసిన ఇంటిని గమనించి దొంగలు వాటిని పగలకొట్టారు. సమీపంలో ఉన్న బంధువులు చూసి రామచంద్రరావుకు తెలియజేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించగా, వారు తాడేపల్లి పోలీసులకు తెలిపారు. ఇంట్లో బీరువాను పగలకొట్టి అందులో వున్న కేజీ వెండి, 5 గ్రాముల బంగారం, రూ. 40 వేల నగదు పోయినట్లు రామచంద్రరావు బంధువులు తెలిపారు.

బ్రాహ్మణ సేవాసమితిచే వేదాశీర్వచనం



మంత్రి మనోహర్, రత్నాకర శాస్త్రికి వేదాశీర్వచనం

తెనాలి: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ కళాసదనంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన, బ్రాహ్మణ వర్గీయుడైన మాగంటి వెంకట రత్నాకర శాస్త్రి, తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వేదాశీర్వచనం చేశారు. కొమ్మమూరి కాశీ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత వహించిన సభలో బ్రాహ్మణ కళాకారులకు చిరుసత్కారం చేశారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఇటీవల లా కోర్సులో తొమ్మిది గోల్డ్ మెడల్స్ సాధించిన విజ్ఞాన్ లా కాలేజీ ప్రొఫెసర్ భాగవతుల నాగసాయి శ్రీరామ్‌కు అభినందన సత్కారం చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు చివుకుల దుర్గాప్రసాద్, తేజోమూర్తుల నరసింహమూర్తి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ, దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు మెంబర్ సుబ్రహ్మణ్యకుమార్, విజయవాడ కొత్తా ధర్మ సంస్థల అధినేత కొత సుబ్బారావు, తెలిదేవరపల్లి శ్యాంసుందర్ శర్మ, పట్టణ బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు. సంస్థ ప్రతినిధులు త్రిపురారి పట్ల దత్తు, చెన్నాప్రగడ శ్రీనివాస్, విష్ణుపట్ల మణి కిషోర్, దావులూరి శ్యామ్‌సుందర్ శర్మ, నందివెలుగు రామకృష్ణశర్మ, కొడవటిగంటి కుమార్, అద్దేపల్లి మాధవశాస్త్రి, సేవాసమితి గౌరవ అధ్యక్షుడు లక్కరాజు లక్ష్మణరావు పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరించేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు సూచించారు. పట్టణంలోని 5,6 శానిటేషన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా అంటిడెన్స్‌ను పరిశీలించారు. ప్రతి రోజు చెత్తను సకాలంలో సేకరించాలని సూచించారు. పట్టణానికి మంచి పేరు తీసుకు వచ్చే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

విగ్రహాల నమూనాల తయారీకి సమాచారం ఏదీ?

తెనాలి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టించనున్న ప్రముఖుల విగ్రహాలకు నమూనాల తయారీకి రాష్ట్రంలోని గుర్తింపు కలిగిన శిల్పులు అందరికీ అవకాశం కల్పించాలని పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. లేకుంటే పక్షపాతంతోనో, స్వలాభంతోనే కేవలం ఒకరిద్దరికి అవకాశం ఇచ్చినట్టుగా భావించాల్సి వస్తుందని స్పష్టంచేశారు. రాజధాని అమరావతిలో ప్రతిష్టించనున్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం, అలాగే నీరుకొండలో ప్రతిష్ట నిమిత్తం భారీ ఎన్టీఆర్ కాంస్య విగ్రహం నమూనాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలిస్తున్నట్టు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. శిల్పకళలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన తమ సంస్థకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టించే విగ్రహాల నమూనాల తయారీకి సమాచారం లేకపోవటం ఆవేదన కలిగిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని పలు కాంస్య విగ్రహాల తయారీ సంస్థలను సంప్రదించగా, వారికి కూడా ఎలాంటి సమాచారం లేదని తెలిసిందన్నారు. శిల్పకారులకు నమూనాలు తయారు చేసుకురమ్మని చెప్పే బాధ్యత ఏ సంస్థకు అప్పచెప్పారో వారు, గుర్తింపు కలిగిన సంస్థలకు సైతం చెప్పకపోవటం సందేహాలకు తావిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని శిల్పకారులందరికీ సమాచారం అందితే శిల్పకారులు పోటీతత్వంతో నమూనాలు గొప్పగా చేస్తారని, అందులోంచి ప్రభుత్వం మంచి నమూనాను ఎన్నుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఒకరిద్దరకు మాత్రమే అవకాశమిస్తే నాణ్యమైన శిల్పం ఎలా వస్తుందని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం/ముఖ్యమంత్రి వెంటనే స్పందించి శిల్పకారులు అందరినీ నమూనాలు సిద్ధం చేయాలని సమాచారం పంపాలని కోరారు.